# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- లోక్ సభ ఎన్నికలలో భాగంగా దేశ వ్యాప్తంగా రేపు 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది.
- రబీ సీజన్ లో 98 వేల 904 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏలూరు జిల్లా సంయుక్త కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు.
- ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో భాగంగా రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య చివరి లీగ్ క్రికెట్ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది.
- నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

==============================

లోక్‌సభ ఎన్నికల ఐదో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రేపు 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. ఐదవ విడతలో ఉత్తర్ ప్రదేశ్‌లో 14 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మహారాష్ట్రలో 13, బిహార్‌లో 5, జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లలో చెరొకటి, ఝార్ఖండ్ 3, ఒడిశా 5, బంగాల్‌లో 7 లోక్‌సభ స్థానాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ నియోజకవర్గాల్లో 695 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

==============================

పాస్ పోర్టు కార్యాలయం అధికారిక వెబ్ సైట్ ను పోలి ఉండే నకిలీ వెబ్ సైట్ పట్ల పాస్ పోర్ట్ దరఖాస్తుదారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ హెచ్చరించింది. ఈ వెబ్ సైట్ల ద్వారా పౌరుల వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ కార్డు వంటి కీలక పత్రాలను సేకరిస్తున్నట్టు పేర్కొంది. వీటిని ఉపయోగించి ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశం ఉందని హోంశాఖ అధికారులు తెలియజేశారు. కొత్త పాస్ పోర్టు, అప్ డేషన్ కోసం ఆన్ లైన్ లో

దరఖాస్తు సమయంలో సదరు వెబ్ సైట్ ను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించింది. అధికారిక వెబ్ సైట్ తరహాలోనే కొద్దిపాటి అక్షరాల మార్పులతో ఈ వెబ్ సైట్ ను మోసపూరితంగా రూపొందిస్తున్నట్లు పేర్కొంది. పాస్ పోర్టు కార్యాలయం అధికారిక వెబ్ సైట్ www.passportindia.gov.inను మాత్రమే పాస్ పోర్టుకు సంబంధించిన అంశాల కోసం వినియోగించాలని సంబంధిత అధికారులు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లాలో రబీ సీజన్ లో 98 వేల 904 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. ఈరోజు ఏలూరులో ఆమె మాట్లాడుతూ, 2 లక్షల 17 వేల 467 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని అనుసంధానం చేయబడిన రైస్ మిల్లులకు తరలించామన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టమని, 225.67 కోట్ల రూపాయలు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేసామాని తెలిపారు. రైతులు కూడా తమ ధాన్యం వర్షానికి తడవకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఏదైనా సహాయం అవసరం అయితే దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆమె సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్లను విడిగా సీసాల్లో విక్రయించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అన్ని పెట్రోల్ బంకుల డీలర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పెట్రోల్ బంకులపై నిరంతరం ఫ్లైయింగ్ స్క్వాడ్ నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్ షిప్ లైసెన్స్ లు రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపింది. పెట్రోల్ బంకులు ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించడమే కాక, ఘర్షణలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అనంతపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గౌతమిశాలి తెలిపారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీగా పదవీ బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షనే లక్ష్యమని అన్నారు. ఈవియం, వివిప్యాడ్ లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద మూడింతల బందోబస్తును ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజున భారీ బందోబస్తు ఏర్పాటుతో, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మచిలీపట్నం నుండి అయోధ్యకు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు మచిలీపట్నం సీనియర్ డిపో మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. ఈరోజు ప్రత్యేక బస్సు సర్వీసుల ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, బాల రాముడి దర్శనం కోసం అయోధ్యకు వెళ్ళే ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సదుపాయాలను అందిస్తుందన్నారు. ఈ బస్సు సింహాచలం, అరసవెల్లి, శ్రీకూర్మం, కలకత్తా, గయా, కాశి అనంతరం అయోధ్య చేరుకుంటుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేశామని, ప్రయాణికుల రద్దీ పెరిగినట్లయితే అదనంగా మరొక బస్సు సర్వీస్ కూడా ఏర్పాటు చేయడానికి ఆర్టీసీ సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది ఉత్తర ఈశాన్య దిశగా ప్రయాణించి ఈనెల 24వ తేదీ నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ఉపరితల ద్రోణి ఆవరించి ఉందని, దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ - ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసింది. విరామం అనంతరం హైదరాబాద్ జట్టు 6 ఓవర్లకు 2 వికెట్ నష్టానికి 83 పరుగులు చేసింది. అలాగే గువాహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య చివరి లీగ్  మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఈరోజు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. డప్పులు, వాయిద్యాలు చెక్క భజనలు, భజన బృందాల కోలాటాల మధ్య వాహనసేవ కొనసాగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి వాహన సేవను తిలకించి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటిఐ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఒంగోలులోని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈరోజు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ, 36 ప్రైవేట్ ఐటీఐలలో  సుమారు 4 వేల సీట్లు ఉన్నాయని అన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్ చదివిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటిఐలలో ఎటువంటి ఫీజు ఉండదని, ప్రైవేట్ ఐటిఐలలో చేరే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్ మెంట్ అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా సమర్పించాలని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులతో తిరుమలలో రద్దీ నెలకొంది. వేసవి సెలవుల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =